సాక్షి
ఖమ్మం
శుక్రవారం । 3 । మార్చి । 2023



'పుష్ప' తరహాలో స్మగ్లింగ్..

పుష్ప సినిమాలో ఎర్రచందనం దుంగలను తరలించినట్లు ఐషర్ వాహనంలో గంజాయి తరలిస్తూ ఓ ముఠా పోలీసులకు పట్టుబడింది. 8లో



షంషేర్.. ఉండిపోవాలంటే!?

అటవీ ప్రాంతం క్రమక్రమంగా అంతరించిపోవడంతో అభయారణ్యాల్లో జంతువుల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోంది. 10లో

గరిష్టం / కనిష్టం
38° / 18°

వాతావరణం

శుక్రవారం ఉదయం జిలాల్లో అక్కడక్కడా చలి ప్రభావం ఉంటుంది. కానీ మధ్యాహ్నం కల్లా ఎండ తీవ్రత మొదలవుతుంది.

న్యూస్‌రీల్

ఎంఈఓ కార్యాలయాన్ని ప్రారంభించిన డీఈఓ



ఎంఈఓ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న డీఈఓ సోమశేఖర శర్మ

ఖమ్మంఅర్బన్: ఇప్పటి వరకు ఖమ్మం రోటరీనగర్‌లోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో కొనసాగుతున్న మండల విద్యా వనరుల కేంద్రం(ఎంఈఓ కార్యాలయం)ను ట్రంక్ రోడ్డులోని పాత డీఈఓ కార్యాలయంలోకి మార్చారు. ఈమేరకు నూతన కార్యాలయాన్ని గురువారం డీఈఓ సోమశేఖరశర్మ ప్రారంభించి మాట్లాడారు. డీఈఓ కార్యాలయాన్ని నూతన కలెక్టరేట్‌కు తరలించడంతో ఈ భవనాన్ని ఎంఈఓ కార్యాలయానికి కలెక్టర్ కేటాయించారని తెలిపారు. ఎంఈఓ ఎం.శ్రీనివాస్, వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

14లోగా 'పంచాప్రాన్' దరఖాస్తులు పంపండి

ఖమ్మం స్పోర్ట్స్: ఆజాదీ కా అమృతోత్సవంలో భాగంగా జిల్లా నెహ్రూ యువక కేంద్రం ఆధ్వర్యాన నిర్వహిస్తున్న 'పంచాప్రాన్' కార్యక్రమానికి 14వ తేదీలోపు యువజన సంఘాలు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా అధికారి చింతల అన్వేష్ సూచించారు. డీవైఓ, డీవైఎస్‌ఓ, కేంద్రియ విద్యాలయం ప్రిన్సిపాల్‌తో కూడిన దరఖాస్తులను పరిశీలించాక, అర్హత కలిగిన సంఘాలకు కేంద్రప్రభుత్వం నుంచి రూ.20వేల చొప్పున నిర్వహణ ఖర్చులు అందుతాయని తెలిపారు. ఆసక్తి కలిగిన సంఘాల బాధ్యులు జిల్లా నెహ్రూ యువ కేంద్రం కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని పేర్కొన్నారు.

మెడికల్ కళాశాలకు స్థలాల అప్పగింత



పాత డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు, డీఎంహెచ్‌ఓ మాలతి

ఖమ్మం వైద్యవిభాగం: జిల్లా ఆస్పత్రికి అనుసంధానంగా ప్రభుత్వం మెడికల్ కళాశాలను మంజూరు చేసిన నేపథ్యాన వచ్చే ఏడాది ప్రవేశాలు కల్పించాలనే భావనతో అధికారులు ఏర్పాట్లు ముమ్మరం చేశారు. ఇప్పటికే మెడికల్ కళాశాలకు పాత కలెక్టరేట్, ఆర్‌అండ్‌బీ భవనాలు, వాటి స్థలాలను కేటాయించారు. ఈమేరకు భవనాలు, స్థలాల కేటాయింపుపై కలెక్టర్ వీ.పీ.గౌతమ్ గురువారం జారీ చేసిన ఉత్తర్వులను కళాశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరరావుకు రెవెన్యూ అధికారులు అందజేశారు. ఖమ్మం అర్బన్ తహసీల్దార్ శైలజ, ఉద్యోగులు పాల్గొన్నారు.

గర్ల్స్ హాస్టల్‌గా ఆర్‌అండ్‌బీ ఆఫీస్

ప్రభుత్వ మెడికల్ కళాశాల పనులు ముమ్మరమైన నేపథ్యాన భవనాల కేటాయింపు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఆర్‌అండ్‌బీ భవన సముదాయాన్ని గర్ల్స్ హాస్టల్‌కు కేటాయించడంతో గురువారం బోర్డు ఏర్పాటు చేశారు. అలాగే, పాత డీఎంహెచ్‌ఓ కార్యాలయాన్ని మెడికల్ కళాశాల బాయ్స్ హాస్టల్‌కు గతంలోనే కేటాయించగా కళాశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు, డీఎంహెచ్‌ఓ మాలతి పరిశీలించారు.

హోంగార్డుల క్యాలెండర్లను ఆవిష్కరించిన సీపీ



క్యాలెండర్లను ఆవిష్కరించిన సీపీ, అధికారులు

ఖమ్మంక్రైం: హోంగార్డుల అసోసియేషన్ ఆధ్వర్యాన రూపొందించిన క్యాలెండర్లను గురువారం ఖమ్మం పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్.వారియర్ ఆవిష్కరించారు. కమిషనరేట్‌లో ఈ కార్యక్రమం జరగగా, హోంగార్డ్ సిబ్బంది, సంక్షేమానికి సంబంధించిన అంశాలపై సీపీ చర్చించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ సుభాష్‌చంద్రబోస్, ఆర్‌ఐ శ్రీశైలం, సీఐ సతీష్, హోంగార్డుల అసోసియేషన్ అధ్యక్షుడు మహ్మద్ రఫీతో పాటు బంక శ్రీను, నీరజ, ఇ.వెంకటేశ్వర్లు, రహీం, వెంకన్న, డి.రవి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నిధులొచ్చేశాయ్..!

జిల్లాకు రూ.248.40 కోట్లు మంజూరు

- సీఎం కేసీఆర్ హామీపై జీఓ జారీ
- చేపట్టాల్సిన పనులపై ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్న అధికార యంత్రాంగం
- జిల్లాలో ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటుకు అడుగులు



ఖమ్మం వ్యూ

సాక్షిప్రతినిధి, ఖమ్మం: జిల్లాకు నిధుల వరద పారుతోంది. ఇప్పటికే ఖమ్మం నగరం అభివృద్ధి పథంలో దూసుకెళ్తుండగా, ఇటీవల సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీల నేపథ్యాన మరిన్ని హంగులు చేకూరనున్నాయి. గతంలో ముఖ్యమంత్రి ప్రకటించిన విధంగా జిల్లాకు రూ.248.40 కోట్లు కేటాయిస్తూ గురువారం జీఓ 32 విడుదల చేశారు. ఈ నిధులతో ఖమ్మం కార్పొరేషన్‌తోపాటు సత్తుపల్లి, వైరా, మధిర మున్సిపాలిటీలు, మేజర్ గ్రామపంచాయతీలు, 589 గ్రామపంచాయతీల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై అధికారులు ప్రతిపాదనలను సిద్ధం చేస్తున్నారు. ఇదిలా ఉండగా.. ముఖ్యమంత్రి హామీ ఇచ్చిన విధంగా ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటుకు కూడా కసరత్తు జరుగుతోంది.

ముఖ్యమంత్రి హామీతో..

జిల్లా అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి గతంలోనే మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌తో పాటు అధికార పార్టీ ఎమ్మెల్యేలు ప్రతిపాదనలు సమర్పించారు. ఈ నేపథ్యాన జనవరి 18న ఖమ్మం కలెక్టరేట్ ప్రారంభోత్సవానికి హాజరైన సీఎం కార్పొరేషన్, మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీలకు నిధులు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. అలాగే మున్నేరుపై తీగల వంతెన నిర్మాణానికి కూడా హామీ ఇవ్వగా.. ఆ మరుసటి రోజే జీఓ విడుదలైంది.

ఇంజనీరింగ్ కళాశాలకు స్థలం ఖరారు

ఖమ్మం సభలోనే ముఖ్యమంత్రి కేసీఆర్ జిల్లా కేంద్రంలో ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటుకు హామీ ఇచ్చారు. రఘునాథపాలెం మండలంలోని జింకలతండా రోడ్డులో విత్తన గిడ్డంగి ఎదురుగా సర్వేనంబర్ 30లో 15 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని రెవెన్యూ అధికారులు గుర్తించగా, గతనెల 13న జేఎన్‌టీయూ ప్రొఫెసర్లు ఖమ్మం ఆర్డీఓ రవీంద్రనాథ్‌తో కలిసి పరిశీలించారు. ఈ స్థలంపై సానుకూలంగా స్పందించిన ప్రొఫెసర్లు మరింత స్థలం అవసరమని చెప్పడంతో ఆ మేరకు ఇంకో పదిహేను ఎకరాలు అందుబాటులో ఉందని, ఇంకా కావాలన్నా కేటాయించొచ్చని రెవెన్యూ అధికారులు తెలిపినట్లు సమాచారం. దీంతో ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు పనులు కూడా త్వరలోనే మొదలుకానున్నట్లు తెలుస్తోంది.

జిల్లాపై సీఎం ప్రత్యేక దృష్టి



ఖమ్మం జిల్లా అభివృద్ధిపై ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక దృష్టి సారించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రోడ్లు, సెంట్రల్ లైటింగ్, గోళ్లపాడు చానల్ ఆధునికీకరణ, లకారం ట్యాంక్‌బండ్, పార్కుల నిర్మాణం తదితర పనులతో నగరం సర్వతోముఖాభివృద్ధి చెంది ఇతర జిల్లాలకు ఆదర్శంగా నిలుస్తోంది. నగరంలో మున్నేరుపై తీగల వంతెన, ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటుకు ముఖ్యమంత్రి కేసీఆర్ హామీ ఇచ్చారు. అలాగే, సభలో ప్రకటించిన మేరకు నిధులు విడుదల చేసిన సీఎంకు జిల్లా ప్రజల తరఫున కృతజ్ఞతలు.

– పువ్వాడ అజయ్‌కుమార్, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి

ప్రతిపాదనలపై కసరత్తు

జిల్లాకు ప్రత్యేక అభివృద్ధి నిధుల కింద రూ.248,.40కోట్లు విడుదల చేస్తూ జీఓ జారీ అయింది. ఇందులో ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌కు రూ. 50 కోట్లు, సత్తుపల్లి, వైరా, మధిర మున్సిపాలిటీలకు రూ.30 కోట్ల చొప్పున మొత్తం రూ.90 కోట్లతో పాటు ప్రతీ గ్రామపంచాయతీకి రూ.10 లక్షల చొప్పున 584 గ్రామపంచాయతీలకు గాను రూ.58.40 కోట్లు విడుదల చేశారు. ఇక మేజర్ గ్రామపంచాయతీలైన పెద్దతండా, ఏదులాపురం, కల్లూరు, తల్లాడ, నేలకొండపల్లికి రూ.10 కోట్ల చొప్పున రూ.50 కోట్లు కలిపి మొత్తంగా జిల్లాకు రూ.248.40 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ నిధుల వినియోగంపై తదుపరి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం కలెక్టర్ వీ.పీ.గౌతమ్‌కు సూచించడంతో చేపట్టాల్సిన పనులపై అధికార యంత్రాంగం ప్రతిపాదనలు సిద్ధం చేస్తోంది.

లక్ష్యం మేరకు రుణాలు ఇవ్వండి

- బ్యాంకర్లతో సమీక్షలో కలెక్టర్ గౌతమ్
- ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టాదారులకూ చేయూతనివ్వాలని సూచన



మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్, పక్కన అదనపు కలెక్టర్ స్నేహలత అధికారులు

ఖమ్మం సహకారనగర్: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో బ్యాంకులకు నిర్దేశించిన లక్ష్యాల మేరకు రుణాలు ఇవ్వాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సూచించారు. కలెక్టరేట్‌లో గురువారం అధికారులు, బ్యాంకర్లతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వల్పకాలిక పంట రుణాల క్రింద రూ.2,887 కోట్లకు గాను రూ.2,434 కోట్లు, అగ్రి ఇన్‌ఫ్రా కింద రూ.164 కోట్లకు రూ.30 కోట్లు, అనుబంధ రంగాలకు రూ.780 కోట్లలో రూ.161 కోట్లు ఇప్పటి వరకు ఇచ్చారని తెలిపారు. మొత్తంగా వ్యవసాయానికి రూ.4,599 కోట్ల లక్ష్యంలో రూ.3,831 కోట్ల ప్రగతి ఉన్నందున మిగతా రుణాలపై దృష్టి సారించాలని సూచించారు. బలహీన వర్గాలకు రుణాల పంపిణీలో ప్రాధాన్యత ఇవ్వాలని, భూరికార్డులు లేని చిన్న, సన్నకారు రైతులతో పాటు ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టాదారులు, జీఓ 58 ద్వారా స్థలాలు క్రమబద్ధీకరించిన యజమానులకు కూడా చేయూతనివ్వాలని కలెక్టర్ తెలిపారు. ఇంకా స్వయం సహాయక సంఘాలు, ముద్ర రుణాలు, ఆసరా పెన్షన్లు, ఆధార్ సమస్యలపై చర్చించారు. అదనపు కలెక్టర్లు స్నేహలత, ఎన్.మధుసూదన్, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాసరెడ్డి, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి అజయ్‌కుమార్, డీఆర్డీఓ విద్యాచందన, డీఏఓ విజయనిర్మల, జిల్లా ఉద్యానవన అధికారి అనసూయ, డీడబ్ల్యూఓ కృష్ణనాయక్, జెడ్పీ సీఈఓ అప్పారావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీడి ఏలూరి శ్రీనివాసరావుతో బ్యాంకుల అధికారులు అనిల్‌కుమార్ కల్పోరే, సుజిత్‌కుమార్, నారాయణ, రాజశేఖర్, విజయ్‌భాస్కర్‌గౌడ్, నర్మద తదితరులు పాల్గొన్నారు.

హరితహారానికి పకడ్బందీగా కార్యాచరణ

జిల్లాలో హరితహారం కింద మొక్కలు నాటేందుకు పకడ్బందీగా కార్యాచరణ సిద్ధం చేయాలని కలెక్టర్ గౌతమ్ తెలిపారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ వచ్చే ఏడాది 32.47 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్ధారించినట్లు పేర్కొన్నారు. ఇందులో శాఖల వారీగా లక్ష్యాలు పెట్టుకుని, నర్సరీల్లో మొక్కల పెంపకంపై దృష్టి సారించాలని చెప్పారు. అదనపు కలెక్టర్ స్నేహలత, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, డీఎఫ్‌ఓ సిద్దార్థ్ విక్రమ్‌సింగ్, జెడ్పీ సీఈఓ అప్పారావు, డీఆర్డీఓ విద్యాచందన, డీఏఓ విజయనిర్మల, జిల్లా ఉద్యానవన అధికారి అనసూయ, జిల్లా నీటి పారుదల శాఖ అధికారి వెంకట్రాం, ఎఫ్‌డీఓ ప్రకాశరావు, మునిసిపల్ కమిషనర్లు రమాదేవి, సుజాత, సునీత పాల్గొన్నారు.

కంటివెలుగు లక్ష్యాలను చేరాలి

కంటి వెలుగు కార్యక్రమంలో నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కంటి అద్దాలు పంపిణీ చేయాలని కలెక్టర్ గౌతమ్ సూచించారు. వైద్య, ఆరోగ్యశాఖ సమీక్షలో ఆయన కంటి వెలుగు, సాధారణ ప్రసవాలు, క్షయ వ్యాధి బాధితుల గుర్తింపుపై ఆరా తీసిన కలెక్టర్ పలు సూచనలు చేశారు. డీఎంహెచ్‌ఓ మాలతి, అధికారులు డాక్టర్ రాంబాబు, డాక్టర్ సైదులు, డాక్టర్ సుబ్బారావు పాల్గొన్నారు.

41 జీపీల్లో రూ.15లక్షల దుర్వినియోగం

కారేపల్లి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించి స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మూడు రోజులుగా కొనసాగుతున్న సామాజిక తనిఖీ ప్రజావేదిక గురువారంతో ముగిసింది. ఈ మేరకు 2019 అక్టోబర్ నుంచి 2022 మార్చి వరకు జరిగిన 6,818 పనులకు సంబంధించి రూ.19.25 కోట్లు వెచ్చించినట్లు గుర్తించారు. ఎంపీడీఓ చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన ప్రజావేదికలో 41పంచాయతీల్లో జరిగిన పనులపై తనిఖీ బృందాలు నివేదికలు సమర్పించగా, సుమారు రూ.15లక్షల మేర నిధులు దుర్వినియోగమైనట్లు తేల్చారు. పదిహేను రోజుల్లో పనులకు సంబంధించి నివేదికలు సమర్పిస్తే మినహాయింపు ఉంటుందని అధికారులు స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా కొన్ని చోట్ల బినామీ పేర్లతో పనులు చేపట్టడంతో నిధులు దుర్వినియోగం జరిగినట్లు గుర్తించారని సమాచారం. అలాగే, పనులు చేయకున్నా బిల్లులు సమర్పించి నిధులు డ్రా చేసినట్లు వెలుగుచూసిందని తెలుస్తోంది.

పన్నుల వసూళ్లకు ప్రత్యేక కేంద్రాలు

28 రోజుల్లో రూ.12 కోట్లు వసూలుకు చర్యలు



గాంధీచౌక్‌లో వ్యాపారి నుంచి పన్ను స్వీకరిస్తున్న మేయర్ నీరజ, కమిషనర్ ఆదర్శ్ సురభి

ఖమ్మంమయూరిసెంటర్: ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు ఇంకా తక్కువ సమయం ఉండడంతో ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పన్నుల వసూళ్లకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టారు. ఈ మేరకు ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని మేయర్ పునుకొల్లు నీరజ, కమిషనర్ ఆదర్శ్ సురభి తెలిపారు. ఇందులో భాగంగా నగరంలోని గాంధీచౌక్‌లో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని ప్రారంభించిన మేయర్, కమిషనర్ స్థానిక వ్యాపారులు, భవన యజమానులకు పన్నుల చెల్లింపుపై అవగాహన కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ బకాయిలను రాబట్టేందుకు నగరంలో ఏర్పాటుచేస్తున్న 14 ప్రత్యేక కేంద్రాలు శుక్రవారం నుండి అందుబాటులోకి వస్తాయని తెలిపారు. నగరంలో 75,742 అసెస్‌మెంట్లు ఉండగా.. 66,136 నివాస, 5,266 వ్యాపార సముదాయలతో పాటు ఇతరత్రా 4,338 ఉన్నాయని పేర్కొన్నారు. వీటి నుంచి రూ.29.15 కోట్లకు గాను రూ.17.10 కోట్లు వసూలు చేశామని, మిగతా బకాయిలను నెలాఖరులోగా రాబడతామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఓ జి.శ్రీనివాసరావు, కార్పొరేటర్ పసుమర్తి రామోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్యే పరిష్కారం కాదు..

న్యాయ విజ్ఞాన సదస్సులో జిల్లా జడ్జి శ్రీనివాసరావు



సదస్సులో మాట్లాడుతున్న జిల్లా జడ్జి శ్రీనివాసరావు

తల్లాడ: ఎదురయ్యే ప్రతీ సమస్యను పెద్దదిగా ఊహించుకుని ఆత్మహత్యలతో జీవితాలను ముగించొద్దని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ టి.శ్రీనివాసరావు సూచించారు. తల్లాడలోని బాలభారతి విద్యాలయంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యాన గురువారం ఏర్పాటుచేసిన న్యాయ విజ్ఞాన చైతన్య సదస్సులో ఆయన మాట్లాడారు. సమాజంలో ఇటీవల కాలంలో ఆత్మహత్యలు పెరుగుతున్నాయని, ఆత్మహత్యలతో సమస్య పరిష్కారం కాదనే విషయాన్ని గుర్తించాలన్నారు. కుటుంబ పెద్ద బలవన్మరణానికి పాల్పడితే ఆ కుటుంబం వీధిన పడుతుందని తెలిపారు. కాగా, విద్యార్థులు చిన్నతనం నుంచే క్రమశిక్షణ అలవర్చుకోవడంతో పాటు గెలుపోటములను సమానంగా స్వీకరిస్తే ఉన్నత స్థాయికి చేరొచ్చని చెప్పారు. ఇక సమాజంలో రుగ్మతలుగా మారిన వరకట్నం, అవినీతికి వ్యతిరేకంగా అందరూ పోరాడాలని జిల్లా జడ్జి సూచించారు. ఆతర్వాత బాల కార్మిక చట్టం, వయోవృద్ధుల చట్టం, పౌరహక్కుల చట్టాలపై ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బాలభారతి విద్యాలయం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి మహ్మద్ జావేద్‌పాషా, వైరా సీఐ సురేష్, సర్పంచ్ పొట్టేటి సంధ్యారాణి, తహసీల్దార్ గంటా శ్రీలత, ఎంపీడీఓ రవీంద్రరెడ్డి, ఎంఈఓ దామోదర ప్రసాద్, ఎస్‌ఐ సురేష్, బాలభారతి విద్యాలయం కరస్పాండెంట్ కోటగిరి ప్రవీణ్, ఈఓ ఉష, న్యాయవాది ఇమ్మడి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

బొగ్గు ఉత్పత్తి, రవాణా లక్ష్యాలు సాధించాలి

సత్తుపల్లిరూరల్: కొత్తగూడెం ఏరియాకు సంబంధించిన బొగ్గు ఉత్పత్తి, రవాణాలో ఎలాంటి అంతరాయం లేకుండా లక్ష్యాలు సాధించాలని సింగరేణి సీఎండీ ఎన్.శ్రీధర్ ఆదేశించారు. హైదరాబాద్ నుంచి గురువారం ఆయన ఏరియాల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ లక్ష్య సాధనకు ఈనెల కీలకమైనందున కొత్తగూడెం ఏరియాలో ప్రతిరోజూ 2.50 లక్షల క్యూబిక్ మీటర్ల ఓబీ తొలగింపు, 49,500 టన్నుల బొగ్గు ఉత్పత్తి, రవాణా జరగాలని స్పష్టం చేశారు. సత్తుపల్లి జేవీఆర్ ఓసీ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కొత్తగూడెం ఏరియా జీఎం జక్కం రమేశ్ మాట్లాడుతూ ఏరియాకు కేటాయించిన ఉత్పత్తి, రవాణా లక్ష్యాన్ని చేరుకుంటామని తెలిపారు. అధికారులు సూర్యనారాయణ, వై.రఘురామిరెడ్డి, శామ్యూల్ సుధాకర్, ఎస్.వెంకటాచారి, నర్సింహారావు, రవీందర్, యోహాన్, వి.కృష్ణయ్య, రమణారెడ్డి, రామకృష్ణ, దేవదాస్, విజయ్ సందీప్ పాల్గొన్నారు.

సువర్ణ ద్వాదశ వాహనాలకు అంకురార్పణ

నేడు వాహన ప్రతిష్ఠా మహోత్సవం



చిత్రకూట మండపంలో ద్వాదశ వాహనాలకు అంకురార్పణ పూజ చేస్తున్న అర్చకులు


భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామివారి ఆలయానికి ప్రవాసాంధ్ర వాసవి సంఘం వితరణతో తయారు చేయించిన నూతన సువర్ణ పూత ద్వాదశ వాహనాలకు గురువారం అంకురార్పణ ఘనంగా జరిగింది. వాహనాలకు చిత్రకూట మండపంలో ప్రత్యేక పూజలు చేశారు. ద్వాదశ దివ్య వాహన ప్రతిష్ఠా మహోత్సవాన్ని శుక్రవారం వైభవోపేతంగా నిర్వహించనున్నారు. వాహన ప్రతిష్ఠ, తిరువీధి సేవ, శనివారం సార్వభౌమ వాహన సేవ జరపనున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు పొడిచేటి సీతారామానుజాచార్యులు, శ్రీమన్నారాయణాచార్యులు, కోటి రామస్వరూప్, వేదపండితులు గుదిమెళ్ల మురళీకృష్ణమాచార్యులు, ఉత్సవ నిర్వాహకులు డాక్టర్ ఎస్‌ఎల్ కాంతారావు, చారుగుళ్ల శ్రీనివాస్, ఎస్‌ఎన్వీ రామారావు, జీ వెంకటాచార్యులు, బండారి కృష్ణయ్య, యశోద రాంబాబు, ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.

లడ్డూలు, తలంబ్రాల తయారీ వేదికలు మార్పు

ఈ నెల 7వ తేదీన హోలీని పురస్కరించుకుని చిత్రకూట మండపంలో తలంబ్రాల తయారీ, రామయ్య పెండ్లికొడుకును చేసే కార్యక్రమం నిర్వహించాల్సి ఉంది. అయితే చిత్రకూట మండపంలో నూతనంగా వచ్చిన స్వర్ణ పూత ద్వాదశ వాహనాలను ఉంచారు. దీంతో తలంబ్రాల తయారీ వేదికను ఉత్తర ద్వార దర్శన వేదిక వద్ద ఏర్పాటు చేయనున్నారు. తానీషా కల్యాణ మండపం వేదికగా లడ్డూలు తయారు చేయనున్నారు.

మాస్టర్ ప్లాన్‌కు మోక్షమెన్నడో?!

- 'సుడా' ముసాయిదా పబ్లికేషన్ నిరవధిక వాయిదా
- మరికొన్ని నెలలు వేచి ఉండాల్సిందేనని ప్రచారం
- పాత ప్లాన్ ప్రకారమే కేఎంసీలో నిర్మాణాలు



సుడా మ్యాప్

ఖమ్మంమయూరిసెంటర్: స్తంభాద్రి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(సుడా) మాస్టర్ ప్లాన్‌కు ఇప్పట్లో మోక్షం లేనట్లేనని తెలుస్తోంది. ఏళ్లుగా ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ మాస్టర్ ప్లాన్ కోసం ఎదురు చూస్తుండగా.. సుడా మాస్టర్ ప్లాన్ తెరపైకి వచ్చింది. ఇది అమల్లోకి వస్తే సమస్య పరిష్కారమవుతుందని అంతా భావించారు. ఈమేరకు ప్రభుత్వం సుడా మాస్టర్ ప్లాన్ తయారీ బాధ్యతలను ఓ సంస్థకు అప్పగించడంతో సుడా, కేఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులతో కలిసి ఖమ్మం కార్పొరేషన్, గ్రామపంచాయతీల్లో పర్యటించి ముసాయిదా సిద్ధం చేశారు. స్టేక్ హోల్డర్ల సమావేశాలు నిర్వహించడంతో అంతా బాగుందని భావిస్తుండగా, ముసాయిదా పబ్లికేషన్ నిలిపివేసినట్లు అధికారికవర్గాలు చెబుతున్నారు.

రెండేళ్లకు పైగా కసరత్తు..

సుడా మాస్టర్ ప్లాన్‌కు తుదిరూపు ఇచ్చిన అధికార యంత్రాంగం ముసాయిదా విడుదలకు సిద్ధమైంది. అయితే, రాష్ట్రంలో పలు పట్టణాల్లో మాస్టర్ ప్లాన్‌పై వివాదాలు తలెత్తిన నేపథ్యాన ఇక్కడ కూడా నిలిపివేసినట్లు తెలుస్తోంది. ఖమ్మం కార్పొరేషన్‌ను కలుపుకు ని సుడాకు మాస్టర్‌ప్లాన్ తయారీ రెండేళ్ల క్రితం ప్రారంభమైంది. అనేకసార్లు అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సుడా చైర్మన్, వైస్ చైర్మన్, కేఎంసీ కమిషనర్‌తో సమావేశమవుతూ ప్లాన్ రూపొందించారు. స్తంభాద్రి అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ(సుడా) పరిధిలో ఖమ్మం కార్పొరేషన్‌తో పాటు ఏడు మండలాలకు చెందిన 46 జీపీలు ఉన్నాయి. వీటిని కలుపుకుని అధికారులు మాస్టర్ ప్లాన్ సిద్ధం చేశారు. ఇది అమల్లోకి వస్తే భవిష్యత్ నిర్మాణాలు, అభివృద్ధి పనులు జరిగే అవకాశముంటుంది.

సార్లు స్టేక్ హోల్డర్ల సమావేశాలూ పూర్తి

2021 ఏడాదిలోనే మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయాలని భావించినా ఎన్నికల కోడ్ తదితర కారణాలతో ముందుకు సాగలేదు. ఎట్టకేలకు 2022 ఫిబ్రవరి 11న తొలి స్టేక్ హోల్డర్ల సమావేశం జరగగా, వచ్చిన సూచనల కు అనుగుణంగా మార్పులు చేశారు. ఆపై 2022 జూలై 1న రెండో సమావేశం ఏర్పాటుచేసి అందులో వచ్చిన సూచనల ఆధారంగా కొన్ని మార్పులు, చేర్పులతో ముసాయిదా సిద్ధం చేశారు. ఇక 2022 అక్టోబర్, నవంబర్‌ల్లో ముసాయిదా పబ్లిష్ చేయాల్సి ఉన్నా సవరణల పేరిట వాయిదా వేస్తూ వచ్చారు. గతేడాది డిసెంబర్‌లో సుడా చైర్మన్, వైస్ చైర్మన్లు సమావేశమై ముసాయిదా పబ్లిష్ చేయాలని నిర్ణయించగా... రాష్ట్ర వ్యాప్తంగా మాస్టర్‌ప్లాన్ల ప్రక్రియ నిలిపేయాలని ప్రభుత్వం నుండి మౌఖిక ఆదేశాలు అందినట్లు సమాచారం.

మరికొన్ని నెలలు ఆగాల్సిందే..

ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌లో ఏళ్ల క్రితం నాటి మాస్టర్ ప్లాన్ అమల్లో ఉండగా.. ప్రస్తుతం నిర్మాణాలు, అభివృద్ధి పనులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీంతో సుడా ఏర్పడ్డాక కొత్త మాస్టర్ ప్లాన్‌కు మోక్షం లభించగా, అమల్లోకి రావడంలో జాప్యం జరుగుతోంది. కాగా, ముసాయిదా ప్లాన్ పబ్లిష్ కావాలంటే ఇంకొన్ని నెలల సమయం పడుతుందని అధికారిక వర్గాలు చెబుతున్నారు. ప్రభుత్వం నుంచి అనుమతి వస్తే తప్ప అడుగు పడే పరిస్థితి లేదని తెలుస్తోంది. ఈ విషయమై 'సుడా' చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్‌ను సంప్రదించగా... 'సుడా మాస్టర్ ప్లాన్ ముసాయిదా సిద్ధం చేసి రాష్ట్ర అధికారులకు సమర్పించాం. అక్కడి నుంచి అనుమతి వస్తే పబ్లిష్ చేసి 90 రోజుల పాటు ప్రజల నుండి సలహాలు, సూచనలు స్వీకరించనున్నాం. అయితే, పబ్లికేషన్ ఆపాలని ప్రభుత్వం నుంచి మాకెలాంటి ఆదేశాలు రాలేదు' అని తెలిపారు.

క్లుప్తంగా

నేడు బీఆర్‌ఎస్‌ ఆధ్వర్యాన నిరసన

ఖమ్మంమయూరిసెంటర్: కేంద్రప్రభుత్వం గ్యాస్‌ సిలిండర్‌ ధరలు పెంచడాన్ని నిరసిస్తూ బీఆర్‌ఎస్‌ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన తెలపనున్నారు. పార్టీ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ కేటీఆర్‌ పిలుపు మేరకు ఖమ్మం ధర్నాచౌక్‌లో ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే నిరసనలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌ పాల్గొంటారు. ఈమేరకు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొనాలని పార్టీ ప్రతినిధులు కోరారు.

గ్యాస్‌ ధరల పెంపు దారుణం : ఎంపీ

గ్యాస్‌ సిలిండర్‌ ధరలు ఇబ్బడిముబ్బడి పెంచడం దారుణమని, తక్షణమే ధరలు తగ్గించి పేద ప్రజలను భారం నుంచి విముక్తులను చేయాలని బీఆర్‌ఎస్‌ లోక్‌ సభా పక్షనేత, ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు డిమాండ్‌ చేశారు. అడ్డూఅదుపూ లేకుండా ప్రజలపై భారాలు మోపడం సరికాదని పేర్కొన్నారు. ప్రధాని మోదీ మహిళా దినోత్సవం సందర్భంగా గ్యాస్‌ ధరలు పెంచారా అని ప్రశ్నించారు. ఎనిమిదేళ్ల క్రితం రూ.460గా ఉన్న సిలిండర్‌ ధర ఇప్పుడు రూ.1,200కు చేరిందని తెలిపారు. ఈమేరకు ప్రజలు ఉద్యమించాలని, లేనిపక్షంలో కేంద్రం మళ్లీమళ్లీ ధరలు పెంచే ప్రమాదముందని ఎంపీ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

5 నుంచి కబడ్డీ పోటీలు, ఎడ్ల పందేలు

వేంసూరు: మండలంలోని కందుకూరులో వెంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం సందర్భంగా ఈనెల 5న 8వ తేదీ వరకు పురుషులకు కబడ్డీ పోటీలు, జాతీయ స్థాయి ఎడ్లపందేలు నిర్వహిస్తున్నట్లు బాధ్యులు తెలిపారు. ఆయా పోటీల నిర్వాహకులు గురువారం వేర్వేరుగా ఏర్పాటుచేసిన సమావేశాల్లో వివరాలు వెల్లడించారు. ఎడ్లపందేలు ఆరు పళ్లు, న్యూ కేటగిరీ, సీనియర్‌ విభాగాల్లో జరగనుండగా మూడు విభాగాల్లో కలిపి విజేతలకు రూ.10.50 లక్షల విలువైన బహుమతులు అందిస్తామని పేర్కొన్నారు. అలాగే, కబడ్డీ పోటీల్లో మొదటి ఐదు స్థానాల్లో నిలిచిన వారికి రూ.2.25లక్షల నగదు బహుమతులు ఇవ్వనున్నట్లు చెప్పారు. ఎంపీపీ పాగుట్ల వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ మారోజు సుమలత, బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు పాలా వెంకటరెడ్డితో పాటు నాయకులు, పోటీల నిర్వాహకులు సురేష్‌, గొర్ల ప్రభాకర్‌రెడ్డి, తెలగవరపు అప్పారావు, నాగరాజు, మందపాటి వెంకటరెడ్డి, బండి జగదీష్‌రెడ్డి, ఒగ్గు దామోదర్‌రెడ్డి, అన్నె శ్రీను, బూరుగు కృప తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల విచారణపై అధికారుల ఆరా

కారేపల్లి: సెల్‌ఫోన్ల చోరీ కేసులో కారేపల్లి మండలం గాంధీనగర్‌ గిరిజన గురుకుల కళాశాల ఇంటర్‌ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ముగ్గురిని కొత్తగూడెం పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. ఈమేరకు ఘటనపై ఐటీడీఏ ఏపీఓ డేవిడ్‌రాజ్‌ గురువారం ఆరా తీశారు. గాంధీనగర్‌ గురుకులం ప్రిన్సిపాల్‌ గాలయ్యకు ఫోన్‌ చేసిన ఆయన విద్యార్థులు బయటకు ఎలా వెళ్లారు, ఉద్యోగుల పర్యవేక్షణ లోపం తదితర అంశాలపై నివేదిక ఇవ్వాలని ఆదేశించినట్లు సమాచారం.

రాజ్యహింసకు వ్యతిరేకంగా మహిళా దినోత్సవం

చర్ల: అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినాన్ని మహిళలపై జరిగే రాజ్యహింస, బ్రాహ్మణీయ హిందూ ఫాసిజానికి వ్యతిరేకంగా జరుపుకుందామని మావోయిస్టు పార్టీ చర్ల శబరి ఏరియా కమిటీ కార్యదర్శి అరుణ పిలుపునిచ్చారు. గురువారం ఆమె లేఖ విడుదల చేశారు. దోపిడీ పాలకవర్గాలు బ్రాహ్మణీయ, హిందుత్వ, భూస్వామ్య వ్యవస్థను బలోపేతం చేస్తూ మహిళా దినోత్సవ పోరాట స్ఫూర్తిని తప్పుదోవ పట్టిస్తున్నాయని ఆరోపించారు. అన్ని రంగాలలో పురుషులతో పాటు మహిళలు పోటీ పడుతున్నా కుటుంబ హింస, రాజ్యహింస పెరుగుతోందన్నారు. అలాగే, పాలకులు చట్టాలను నీరుగార్చి దోషులకు శిక్ష పడకుండా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. ఈ క్రమంలో మహిళలపై జరుగుతున్న అన్నిరకాల హింసలకు వ్యతిరేకంగా పోరాడదామని ఆమె పిలుపునిచ్చారు.

ఆదివాసీ నాయకుడిపై దాడి

ములకలపల్లి: ఆదివాసీ జేఏసీ నాయకుడు ఊకే ముక్తేశ్వరరావుపై దాడి జరగగా, ఆయనను పోలీసులు పాల్వంచ ఆస్పత్రికి తరలించారు. వివరాలు... మండలంలోని సీతారాంపురంలో నివసించే ఊకే ముక్తేశ్వరరావు పాతూరు గ్రామ శివారులో రక్తపు మరకలతో పడి ఉండడాన్ని స్థానికులు గమనించారు. దీంతో పోలీసులకు సమాచారం అందించగా వారు చేరుకొని ఆయనను పాల్వంచకు తరలించారు. పాల్వంచ సీఐ ఎం.నాగరాజు ఆస్పత్రికి వచ్చి ఘటనపై వివరాలు సేకరించినట్లు సమాచారం. కాగా, ముక్తేశ్వరరావుపై కత్తులతో దాడికి పాల్పడినట్లు ప్రచారం జరుగుతోంది.

ఖమ్మం మార్కెట్‌ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
కందులు	7,900	7,100
మినుములు	7,600	7,600
మిర్చి	21,600	16,000
మిర్చి తాలు	12,000	7,500
పత్తి	7,500	6,000

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్‌ గెలలు

టన్ను ధర	రూ.13,781

● ఇక్కడ కాదు.. అక్కడే!

జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్‌ నుంచి పల్లె వెలుగు సర్వీసులను రోజురోజుకు పెంచుతూ వెళ్తున్నారు. దీంతో కొత్త బస్టాండ్‌లో ప్రయాణికులు తగ్గి వెలవెలపోగా.. పాత బస్టాండ్‌ మాత్రం ప్రయాణికులు, బస్సులతో కళకళలాడింది. చాలా మందికి విషయం తెలియక కొత్త బస్టాండ్‌కు రావడంతో పాత బస్టాండ్‌ నుంచే పల్లె వెలుగు సర్వీసులు నడుస్తున్నాయని సిబ్బంది అవగాహన కల్పించారు. దీంతో వారు మళ్లీ ఉసూరుమంటూ పాత బస్టాండ్‌కు వెళ్లాల్సి వచ్చింది. ఇక చుట్టుపక్కల గ్రామాల నుంచి హైదరాబాద్‌, ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు ఖమ్మం వచ్చిన వారిని పాత బస్టాండ్‌లో దింపడంతో అయోమయానికి గురైనా మళ్లీ కొత్త బస్టాండ్‌కు బయలుదేరారు.

– స్టాఫ్‌ ఫొటోగ్రాఫర్‌



ప్రయాణికులు లేక వెలవెలబోతున్న కొత్త బస్టాండ్‌



పాత బస్టాండ్‌ ప్లాట్‌ఫాంలపై ప్రయాణికుల రద్దీ



ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది



పాత బస్టాండ్‌లో పల్లెవెలుగు బస్సులు

కాలిన దేహం.. కాసుల బేరం!?

- రైస్‌మిల్లు ప్రమాదంలో గాయపడిన ఇటుకబట్టీల కూలీ
- ఆపై మృతి.. గుట్టుచప్పుడు కాకుండా అంత్యక్రియలు
- మృతుడి కుటుంబ సభ్యులతో మిల్లు నిర్వాహకుల బేరసారాలు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: సుజాతనగర్‌ మండలంలో దారుణం చోటు చేసుకుంది. ఓ రైసు మిల్లులో రక్షణ చర్యలు కరువైన కారణంగా కూలీ ఆయుష్షు అర్ధంతరంగా తీరిపోయింది. దుర్ఘటనపై పోలీసులకు సమాచారం అందించాల్సిన మిల్లు యాజమాన్యం మృతుడి కుటుంబ సభ్యులకు కరెన్సీ ముట్టచెప్పి గుట్టుచప్పుడు కాకుండా అంత్యక్రియలు చేయించింది. పది రోజుల క్రితం జరిగిన ఈ ఘటన వివరాలు ఆలస్యంగా గురువారం వెలుగు చూశాయి.

రైస్‌మిల్లులో ప్రమాదం

చండ్రుగొండ మండలానికి చెందిన ఓ వ్యక్తి ఇటుక బట్టీల్లో కూలీగా పనిచేస్తున్నాడు. బట్టీలో ఇటుకలు కాల్చేందుకు అవసరమైన ఊక కోసం సుజాతనగర్‌ మండలంలోని ఓ రైస్‌ మిల్లుకు రాగా.. బాయిలర్‌ వద్ద ఉండి పరిశీలిస్తున్న క్రమంలో వేడి పదార్థాలు ఆయనపై పడ్డాయి. దీంతో తీవ్రంగా గాయపడిన ఆయనను కొత్తగూడెంలోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించేలోగా మృతి చెందాడు.

గుట్టుచప్పుడు కాకుండా

రైస్‌ మిల్లులో సరైన రక్షణ చర్యలు, భద్రతా ప్రమాణాలు పాటించకపోవడమే ఈ ఘటనకు కారణమని తెలుస్తోంది. కాగా, కూలీ మృతి విషయం పోలీసులకు తెలిసినా, రెవెన్యూ అధికారుల దృష్టికి వచ్చినా మిల్లులోని లోపాలు బయటపడతాయని భావించిన యాజమాన్యం వెంటనే రంగంలోకి దిగింది. ఇటుక బట్టీల యజమాని ద్వారా మృతుడి కుటుంబ సభ్యులకు రాయబారం నడిపించారు. తృణమో, ఫణమో ముట్టచెబుతామని.. అనారోగ్య కారణాల వల్ల కూలీ మరణించినట్టుగా చెప్పాలని ఒత్తిడి తీసుకొచ్చి వెనువెంటనే అంత్యక్రియలు పూర్తిచేయించారు.

మాట తప్పారు

కూలీ అంత్యక్రియలు నిర్వహించాక ఆర్థికసాయం అందుతుందని ఆ కుటుంబం భావిస్తే... మిల్లు యజమాని మాత్రం తన దుర్బుద్ధిని ప్రదర్శించాడు. మృతుడి కుటుంబ సభ్యులకు సాయం చేస్తానన్న మాట తప్పాడు. దీంతో ఈ విషయం బయటకు వచ్చింది. దీంతో మరోసారి మృతుడి కుటుంబ సభ్యులతో బేరసారాలు మొదలెట్టినట్టు తెలుస్తోంది. ఈసారి మృతుడి కుటుంబ సభ్యుల గొంతు నొక్కేందుకు ఖాకీల సాయం కూడా తీసుకుంటున్నారని సమాచారం. ఈ విషయమై సుజాతనగర్‌ పోలీసులను గురువారం ఆరా తీయగా 'మాకు ఎలాంటి సమాచారం లేదు' అని బదులివ్వడం గమనార్హం.

సామాన్యులపై మోయలేని భారం..

గ్యాస్‌ ధర పెంపుపై కాంగ్రెస్‌ ఆధ్వర్యాన నిరసన

ఖమ్మం సహకారనగర్: గ్యాస్‌సిలిండర్‌ ధరలు పెంచడం ద్వారా కేంద్రప్రభుత్వం సామాన్యులపై మోయలేని విధంగా భారం మోపిందని కాంగ్రెస్‌ జిల్లా, నగర అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్‌, మహమ్మద్‌ జావేద్‌ ఆరోపించారు. కేంద్రం పెంచిన ధరలను తగ్గించాలనే డిమాండ్‌తో జిల్లా కేంద్రంలో గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎన్‌డీఏ అధికారంలోకి వచ్చిన సమయాన రూ.400గా ఉన్న సిలిండర్‌ ధర రూ.1,200 వరకు చేరడంతో బీజేపీకి ప్రజలపై ఉన్న చిత్తశుద్ధి అర్థమవుతోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌ మహిళా విభాగం అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, నాయకులు ఏలూరి రజని, వెంకన్న, బోయిన వేణు, మలీదు వెంకటేశ్వర్లు, మిక్కిలినేని నరేందర్‌, మద్ది వీరారెడ్డి, సయ్యద్‌ హుస్సేన్‌, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు



సిలిండర్లతో నిరసన తెలుపుతున్న నాయకులు

'మైనార్టీ బంధు' ప్రవేశపెట్టండి

రాష్ట్రంలో మైనార్టీలను బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం మోసం చేస్తోందని కాంగ్రెస్‌ జిల్లా, నగర అధ్యక్షులుదుర్గాప్రసాద్‌, జావీద్‌ ఆరోపించారు. ఈమేరకు మైనార్టీ బంధు ప్రకటించాలనే డిమాండ్‌తో గురువారం సంతకాల సేకరణ మొదలుపెట్టగా వారు మాట్లాడారు. నాయకులు అబ్బాస్‌ బేగ్‌, సయ్యద్‌ మహమ్మద్‌, సయ్యద్‌ జహీర్‌, ఇబ్రహీం పాల్గొన్నారు.

కారుణ్య హృదయంతో జీవనం సాగించాలి

కరుణగిరి ఉత్సవాల్లో బిషప్‌ ఉడుముల బాల

ఖమ్మంరూరల్: ఏసు ప్రభువు అందించిన దివ్య కారుణ్య హృదయంతో భక్తులు జీవనం సాగిస్తూ, సమాజంలో అవసరమైన వారికి చేయూతనివ్వాలని బిషప్‌ ఉడుముల బాల సందేశమిచ్చారు. కరుణగిరి చర్చిలో నిర్వహిస్తున్న యాత్రా మహోత్సవాలు గురువారం ముగియగా, దివ్య పూజలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఏసు ప్రభువు బోధనలు అందరికీ మార్గదర్శకమని తెలిపారు. ఖమ్మం కరుణగిరిలో జనులందరి మేలు కోసం మహోత్సవాలు నిర్వహించటం ఆనందంగా ఉందని చెప్పారు. దివ్య బలిపూజకు తెలుగు రాష్ట్రాలకు చెందిన వేలాది మంది భక్తులు హాజరు కాగా, ఏర్పాట్లను కరుణగిరి డైరెక్టర్‌ మాథ్యూ వరప్రసాద్‌ రాజు తదితరులు పర్యవేక్షించారు.



మాట్లాడుతున్న బిషప్‌ ఉడుముల బాల

తారకరత్నకు నివాళులర్పించిన మంత్రి



ఖమ్మంమయూరిసెంటర్: ఇటీవల మృతి చెందిన సినీ నటుడు నందమూరి తారకరత్న సంతాప సభ గురువారం హైదరాబాద్‌లో జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌ పాల్గొని తారకరత్నం చిత్రపటం వద్ద నివాళులర్పించడంతో పాటు ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు.

తారకరత్న చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి పువ్వాడ

పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లాలి

వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు సుధీర్‌బాబు



ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్రంలో ఎప్పుడైనా ఎన్నికలు జరిగే అవకాశమున్నందున వైఎస్సార్‌టీపీ శ్రేణులు కలిసికట్టుగా పనిచేస్తూ పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లాలని జిల్లా అధ్యక్షుడు లక్కినేని సుధీర్‌బాబు సూచించారు. ఖమ్మంలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ అధ్యక్షురాలు వైఎస్‌.షర్మిల చేపట్టిన పాదయాత్రకు మంచి స్పందన వస్తున్నందున అధికారంలోకి వస్తే అమలుచేసే పథకాలను ప్రజలకు వివరించాలని తెలిపారు. నాయకులు వాలూరి సత్యనారాయణ, ఎండపల్లి వెంకయ్య, గుగులోత్‌ రూప్లానాయక్‌, సింగరం లక్ష్మి, ఆలస్యం రవి, కొత్త బాలాజీరావు, రాంబాబునాయక్‌, మస్తాన్‌పాషా, చింతల వాసు, పి.రాఘవ, గోరంట రమేష్‌బాబు, బానోత్‌ వీరునాయక్‌, పీవీఎం.ప్రసాద్‌, ఆలేరు ఉమామహేశ్వర్‌రెడ్డి, వాకా వీరారెడ్డి, ఎస్‌.రవి, శ్రీరాం, మర్రి రవీంద్రరెడ్డి, అల్లిక వెంకటేష్‌, రేలా నరసింహారెడ్డి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

లక్ష్యాల పేరిట వేధింపులు సరికాదు

ఖమ్మంగాంధీచౌక్: అశాస్త్రీయమైన, ఆచరణ సాధ్యం కాని లక్ష్యాలను నిర్దేశించి గ్రామీణ డాక్‌ సేవక్స్‌(జీడీఎస్‌)ను వేధించడం సరికాదని తెలంగాణ సర్కిల్‌ జీడీఎస్‌పీ జేసీఏ చైర్మన్‌ చెరుకూరి కోటేశ్వరరావు ఆరోపించారు. ఖమ్మం గాంధీచౌక్‌లోని తపాలా డివిజన్‌ కార్యాలయం ఎదుట ఉమ్మడి జిల్లా పరిధిలోని గ్రామీణ డాక్‌ సేవక్స్‌ గురువారం ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోటేశ్వరరావు మాట్లాడుతూ ఉన్నతాధికారుల మెప్పుకోసం కింది స్థాయి అధికారులు తమను ఇబ్బంది పెడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కొందరు అధికారులు లక్ష్యాలను చేరుకోకపోగా ఉద్యోగాలు విడిచిపెట్టాలని చెబుతుండడం సరికాదన్నారు. తపాలా పథకాల విజయవంతంలో ప్రధాన భూమిక పోషిస్తున్న జీడీఎస్‌లను ఇబ్బందులకు గురి చేస్తే సహించేది లేదని ఆయన హెచ్చరించారు. ఈ ధర్నాలో వివిధ యూనియన్ల బాధ్యులు మాదిరాజు రాంప్రసాద్‌, ఎస్‌.కే.మౌలాలి, మత్తె వెంకటేశ్వరరావు, కమటం నాగేశ్వరరావు, వి శ్రీనివాస్‌రావు, పట్టాభిరామయ్య, సర్వేశ్వరరావు, ప్రతాపరెడ్డి, శ్రీరాములు, రేణుక, జానకమ్మ తదితరులు పాల్గొనగా, పమ్మి వెంకటేశ్వరరావు, బి.హుస్సేన్‌ తదితరులు మద్దతు తెలిపారు.



ధర్నాలో మాట్లాడుతున్న కోటేశ్వరరావు

నెల్లిపాక సహకార సంఘం సీఈఓ సస్పెండ్‌

అశ్వాపురం: మండలంలోని నెల్లిపాక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సీఈఓ కుంజా రామారావును సస్పెండ్‌ చేస్తూ సంఘం పాలకవర్గం గురువారం తీర్మానం చేసింది. సహకార సంఘంలో 2021-22ఏడాది ఆడిట్‌లో రూ.20,06,252 దుర్వినియోగం, అవకతవకలు జరిగినట్టు అధికారులు డీసీఓకు నివేదిక అందజేశారు. గత డిసెంబర్‌ 31న సంఘంలో నిధుల దుర్వినియోగానికి సంబంధించి సీఈఓను సస్పెండ్‌ చేయాలని పాలకవర్గానికి డీసీఓ ఆదేశాలు జారీ చేశారు. మూడు పాలకవర్గ సమావేశాలు జరిగినా డీసీఓ ఆదేశాలు బేఖాతర్‌ చేశారు. సంఘం కార్యాలయంలో గురువారం సంఘం అధ్యక్షుడు తుక్కాని మధుసూదన్‌రెడ్డి అధ్యక్షతన పాలకవర్గ సమావేశం నిర్వహించారు. సమావేశానికి హాజరైన జిల్లా సహకార అధికారి వెంకటేశ్వర్లు పాలకవర్గంపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. డీసీఓ సమక్షంలో నిధుల దుర్వినియోగానికి సంబంధించి బాధ్యుడిగా గుర్తించి సీఈఓ కుంజా రామారావును సస్పెండ్‌చేస్తూ పాలకవర్గం ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. తాత్కాలిక సీఈఓగా కంప్యూటర్‌ ఆపరేటర్‌ వెంకట్‌కు బాధ్యతలు అప్పగించారు. వైస్‌ చైర్మన్‌ కమటం సురేశ్‌తో పాటు డైరెక్టర్లు పాల్గొన్నారు.

పోటీలను జయప్రదం చేయండి

ఖమ్మం సహకారనగర్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 5న సర్దార్‌ పటేల్‌ స్టేడియంలో ఏర్పాటుచేస్తున్న క్రీడా, సాంస్కృతిక పోటీలను విజయవంతం చేయాలని టీఎన్జీవోస్‌ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్‌ అఫ్జల్‌ హసన్‌, ఆర్‌.వీ.ఎస్‌ సాగర్‌ కోరారు. నగరంలోని టీఎన్జీవోస్‌ ఫంక్షన్‌హాల్‌లో గురువారం జరిగిన కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడుతూ ఓ పక్క ఇంటి బాధ్యత, మరోవైపు ఉద్యోగ బాధ్యతలతో ఒత్తిడికి లోనయ్యే మహిళా ఉద్యోగుల కోసం పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమానికి టీఎన్జీవో కేంద్ర సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మామిళ్ల రాజేందర్‌, రాయకంటి ప్రతాప్‌ హాజరవుతారని పేర్కొన్నారు. ఇంకా ఈ సమావేశంలో నాయకులు నందగిరి శ్రీను, సుంచు వీర నారాయణ, నాగుల్‌ మీరా, పవన్‌, శాబాసు జ్యోతి, స్వప్న తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీఎన్జీవోస్‌ అధ్యక్షుడు అఫ్జల్‌హసన్‌

మొక్కల డబ్బులిస్తే అప్పులు తీర్చుకుంటా..

జీపీ అధికారులకు నర్సరీ నిర్వాహకుడి వినతి

బూర్గంపాడు: హరితహారంలో నాటేందుకు ఏడాదిన్నర కిందట జిల్లాలోని పలు గ్రామపంచాయతీలకు మొక్కలు సరఫరా చేశామని, వాటి డబ్బు అడిగితే సర్పంచ్‌లు, కార్యదర్శులు నెలల తరబడి తిప్పుతున్నారని, నర్సరీ నిర్వహణ కోసం రూ.లక్షల మేర అప్పు చేయగా వడ్డీ పెరుగుతోందని, ఇకనైనా డబ్బు చెల్లిస్తే అప్పులు తీర్చుకుంటానని ఓ నర్సరీ నిర్వాహకుడు గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్దకు వెళ్లి గోడు వెళ్లబోసుకున్నాడు. మండలంలోని మోరంపల్లి బంజరకు చెందిన భద్రాద్రి నర్సరీ నిర్వాహకుడు సారెడ్డి నారపరెడ్డి ఉమ్మడి జిల్లాలోని పలు గ్రామపంచాయతీలకు 2021లో హరితహారం కోసం మొక్కలు సరఫరా చేశాడు. వాటికి సంబంధించి గ్రామ పంచాయతీల నుంచి రూ.21 లక్షల బిల్లులు రావాల్సి ఉండగా అటు అధికారులు, ఇటు ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. దీంతో నారపరెడ్డి దంపతులు గురువారం లక్ష్మీపురం, నకిరిపేట, ముసలిమడుగు, ఇరవెండి, ఉప్పుసాక గ్రామపంచాయతీ కార్యాలయాల వద్ద తమ నిరసన తెలిపారు. ఏడాదిన్నర గడిచిపోయినందున ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని తమకు బిల్లులు ఇప్పించాలని కోరారు.



నిరసన తెలుపుతున్న నారపరెడ్డి దంపతులు

ప్రభుత్వ ఆస్పత్రికి జనరేటర్‌ వితరణ

నేలకొండపల్లి: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి జోయాలుకాస్‌ ఫౌండేషన్‌ బాధ్యులు రూ.5.50 లక్షల విలువైన 150 కేవీ జనరేటర్‌ అందజేశారు. పలు స్వచ్ఛంద సంస్థలు, స్థానికుల విజ్ఞప్తితో ఈ జనరేటర్‌ను అందజేయగా, వైద్యచికిత్సలో ఇబ్బందులు తొలగిపోనున్నాయి. కాగా, ఈ జనరేటర్‌ను శుక్రవారం ఎమ్మెల్యే ఉపేందర్‌రెడ్డి, వైద్య విధాన పరిషత్‌ సూపరింటెండెంట్‌, డాక్టర్‌ బి.వెంకటేశ్వర్లు, జోయాలుకాస్‌ ఆర్‌ఎం రాబిన్‌ తంబి ప్రారంభిస్తారని వైద్యాధికారి కె.రాజేష్‌ తెలిపారు.

'పుష్ప' స్ఫూర్తిగా గంజాయి స్మగ్లింగ్‌!

- ఐషర్‌ వ్యాన్‌కు ప్రత్యేక అరలు ఏర్పాటు
- రూ.40 లక్షల విలువైన సరుకు స్వాధీనం చేసుకున్న పోలీసులు

బూర్గంపాడు: పుష్ప సినిమాలో ఎర్రచందనం దుంగలను తరలించేందుకు పాలవ్యాన్‌లో సగభాగాన్ని అరలుగా ఏర్పాటు చేసిన హీరోను స్ఫూర్తిగా తీసుకున్నారు కావొచ్చు.. అచ్చం అదే విధానాన్ని ఇక్కడ గంజాయి స్మగర్లు ఫాలో అయ్యారు. ఐషర్‌ వాహనంలోని క్యాబిన్‌, ట్రక్‌కు మధ్యలో ప్రత్యేక అర ఏర్పాటు చేసుకుని అందులో గంజాయి తరలిస్తున్న ఓ ముఠా పోలీసులకు పట్టుబడింది. బూర్గంపాడు పోలీస్‌స్టేషన్‌లో పాల్వంచ సీఐ నాగరాజు గురువారం వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి. గురువారం ఉదయం సారపాక ప్రధానకూడలిలో ఎస్‌ఐ సంతోష్‌ వాహనాలను తనిఖీ చేస్తుండగా, భద్రాచలం వైపు నుంచి వస్తున్న ఐషర్‌ వాహనం అతివేగంగా దూసుకువెళ్లింది. దీంతో ఎస్‌ఐ వెంబడించి బీపీఎల్‌ స్కూల్‌ వద్ద ఆపి తనిఖీ చేస్తే ఏమీ లభించలేదు. కానీ అనుమానంతో డ్రైవర్‌, క్లీనర్లను ఎస్‌ఐ గట్టిగా మందలించగా ఐషర్‌ వాహనంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అరలు, అందులో గంజాయి తరలిస్తున్న విషయాన్ని ఒప్పుకున్నారు. ఈ మేరకు పది సంచుల్లోని రూ.40 లక్షల విలువైన 1.96 క్వింటాళ్ల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మహారాష్ట్రకు చెందిన వ్యాన్‌ డ్రైవర్‌ ఫారూక్‌ అల్తాఫ్‌ షేక్‌, క్లీనర్‌ షేక్‌ ఖలీల్‌ సలీంను అదుపులోకి తీసుకుని మహారాష్ట్రలోని నాందేడ్‌కు గంజాయి తరలిస్తున్నట్లు గుర్తించారు. అయితే, సూత్రధారులైన మహారాష్ట్రకు చెందిన అజాద్‌ షేక్‌ మున్నా, సయ్యద్‌ ఖదీర్‌ మరికొందరి కోసం గాలిస్తున్నట్లు సీఐ నాగరాజు తెలిపారు. బూర్గంపాడు ఎస్‌ఐలు సంతోష్‌, బి.శ్రీనివాస్‌ సమావేశంలో పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న గంజాయి, నిందితులతో పోలీస్‌ అధికారులు



వ్యాన్‌ క్యాబిన్‌, ట్రక్‌కు మధ్యలో ఏర్పాటు చేసిన ప్రత్యేక అర

ఈసారి ఇయర్ ఎండింగ్ పేరుతో!

- అకౌంట్ టేకోవర్ బారిన మరో సంస్థ
- 8430 డాలర్లు కాజేసిన సైబర్ నేరగాళ్లు
- సిటీ సైబర్ క్రైమ్ ఠాణాలో కేసు నమోదు



సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయ స్థాయిలో లావాదేవీలు చేసే కంపెనీలను టార్గెట్‌గా చేసుకుంటున్న సైబర్ నేరగాళ్లు అకౌంట్ టేకోవర్ ఫ్రాడ్స్ కొనసాగిస్తున్నారు. సిటీ సైబర్ క్రైమ్ పోలీసుస్టేషన్ పరిధిలో వారం రోజుల్లో రెండో కేసు నమోదైంది. బంజారాహిల్స్ కేంద్రంగా పని హెచ్‌బీఎల్ పవర్ సిస్టమ్స్ లిమిటెడ్ సంస్థ నుంచి రూ.1.39 లక్షల డాలర్లు కాజేయగా గత శుక్రవారం... బాగ్ అంబర్‌పేట్ ఏబీఆర్ ఆర్గానిక్స్ లిమిటెడ్ సంస్థ నుంచి 8430 డాలర్లు స్వాహా చేయడంపై గురువారం హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసుస్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి. ఈసారి సైబర్ నేరగాళ్లు ఫైనాన్షియల్ ఇయర్ ఎండింగ్ కారణంగా చూపి తమ బ్యాంకు ఖాతా వివరాలు ఈ–మెయిల్ చేశారు. ఏబీఆర్ సంస్థ వివిధ రకాలైన రేసిన్ సంబంధిత రసాయనాలకు తయారు చేస్తుంది. దీనికోసం కొన్నాళ్లుకు చైనాకు చెందిన సంస్థ నుంచి ముడి పదార్థాలు దిగుమతి చేసుకుంటోంది. దీనికి సంబంధించిన ఇన్వాయిస్‌లు ఈ–మెయిల్ ద్వారా అందుకున్న వెంటనే ఏబీఆర్ సంస్థ నగదును చెల్లిస్తుంది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖలో ఉన్న తమ ఖాతా నుంచి చైనాలోని సదరు సంస్థ ఖాతాలోకి ఈ మొత్తం బదిలీ చేస్తుంటుంది. ఈ లావాదేవీలకు సంబంధించి ఈ రెండు సంస్థల మధ్య ఈ–మెయిల్స్ ద్వారా సంప్రదింపులు జరుగుతాయి. చైనా సంస్థకు చెందిన ఈ–మెయిల్‌ను హ్యాక్ చేయడం ద్వారా సైబర్ నేరగాళ్లు ఈ సంప్రదింపులను గుర్తించారు. నగదు చెల్లింపు సమయం ఆసన్నమైందని తెలుసుకున్న కేటుగాళ్లు చైనా సంస్థ మాదిరిగా ఏబీఆర్‌కు ఈ–మెయిల్ పంపారు. ఆ సంస్థ పేరుతోనే దీన్ని రూపొందించిన సైబర్ క్రిమినల్స్ చివరలో మాత్రం మెయిల్.కామ్‌ను చేర్చారు. అందులో ఆర్థిక సంవత్సరం ముగుస్తుండటంతో తమ బ్యాంకు ఖాతాలకు సంబంధించిన ఆడిటింగ్ జరుగుతోందని, ఈ నేపథ్యంలోనే గతంలో నగదు పంపే ఖాతాలకు కాకుండా కొత్త దానికి పంపాలంటూ సూచించారు. సైబర్ నేరగాళ్లు దుబాయ్‌లో ఉన్న తమ బ్యాంకు ఖాతా వివరాలు ఈ ఈ–మెయిల్‌లో పొందుపరిచారు. ఈ–మెయిల్ ఐడీలో మార్పులు గమనించని ఏబీఆర్ సంస్థ ఇటీవల వచ్చిన ముడి సరుకునకు సంబంధించిన 8430 డాలర్లు (దాదాపు రూ.7 లక్షలు) దుబాయ్‌లోని బ్యాంక్ ఖాతాలోకి బదిలీ చేశారు. గడిచిన కొన్నాళ్లుగా చైనా సంస్థ నుంచి ఏబీఆర్ సంస్థకు వరుస ఈ–మెయిల్స్ వస్తున్నాయి. అందులో తమకు చెల్లించాల్సి మొత్తం తక్షణం బదిలీ చేయాలంటూ చైనా సంస్థ కోరింది. దీంతో ఏబీఆర్ సంస్థ ప్రతినిధులు ఆరా తీయగా అసలు విషయం బయటపడింది. సంస్థ ఎండీ ఫిర్యాదు మేరకు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు గురువారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఆలయ భూముల కబ్జాపై నోటీసులు

వివరాలు తెలియజేయాలని అధికారులకు హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ఆలయ భూముల కబ్జాపై వివరాలు తెలియజేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను జూన్ 13కు వాయిదా వేసింది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలోని పలు ఆలయాల భూములను కబ్జా చేసి ఏకంగా రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేస్తున్నారంటూ ఓ పత్రికలో ప్రచురితమైన వార్త ఆధారంగా మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లకు చెందిన సి.అనిల్‌కుమార్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. 'జడ్చర్లలోని వెంకటేశ్వర స్వామి ఆలయానికి చెందిన దాదాపు 63 ఎకరాలు ఆక్రమణకు గురయ్యాయి. దేవరకద్ర మండలం అప్పంపల్లిలో చినరాజమూరి ఆంజనేయస్వామి ఆలయానికి చెందిన భూమిలో ప్లాట్లు, లే–అవుట్లు వెలిశాయి. నారాయణపేట జిల్లా మరికల్ మండలంలోని 44 ఎకరాల ఆలయ భూమిలో సగానికి పైగా కబ్జాకు గురైంది. పూర్వం రాజులు, నిజాం నవాబులు పాలమూరులోని పలు ఆలయాలకు పెద్ద ఎత్తున భూములు ఇచ్చారు. ఈ భూముల సాగు ద్వారా వచ్చే ఆదాయాన్ని ఆలయ నిర్వహణకు వెచ్చించాలన్నది వారి సంకల్పం. అయితే ఇటీవల కొందరు ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, అధికారులు మిలాఖత్ అయి అందినకాడికి దండుకుని భూములను పంచి పెడుతున్నారు. ఉమ్మడి జిల్లాలో వందల ఎకరాల ఇనాం భూమి అన్యాక్రాంతమైంది. ఆలయ భూములను కాపాడటమే కాకుండా, ఇకపై కబ్జాకు గురికాకుండా న్యాయపరమైన చర్యలు తీసుకునేలా అధికారులను ఆదేశించాలి' అని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై ప్రధా న న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్‌భూయాన్, జస్టిస్ తుకారాం జీ ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. వాదనలు విన్న ధర్మాసనం.. అధికా రులకు నోటీసులు జారీ చేస్తూ, విచారణను వాయిదా వేసింది.

దోపిడీ పాలకులను గద్దె దింపాలి

ఉండవెల్లి: తెలంగాణలో దోపిడీ పాలకులను గద్దె దింపి.. బీఎస్పీని అధికారంలోకి తీసుకొస్తే 10 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ చెప్పారు. ఆయన చేపట్టిన బహుజన రాజ్యాధికార యాత్ర గురువారం రాత్రి జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవెల్లి మండలం శేరుపల్లె, ప్రాగటూరు, మారమునగాల–1, 2 గ్రామాల్లో కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అంతకు ముందు మిర్చి తీయడానికి కేటీదొడ్డి నుంచి ప్రాగటూరుకు వచ్చిన వలస కూలీలతో ఆయన మాట్లాడారు. పూరి గుడిసెల్లో ఉంటూ పిల్లలను ఎందుకు ఆగం చేస్తున్నారని వారిని ప్రశ్నించారు, గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు, గురుకులాల్లో పిల్లల్ని చేర్చాలని సూచించారు. అనంతరం ప్రాగటూరులో పార్టీ జెండాను ఆవిష్కరించారు.



ప్రాగటూరులో వలస కూలీలతో మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్

రియల్ సార్‌కి రీల్ సార్ యూనిట్ సాయం

రంగయ్య మాస్టారుకి రూ.3లక్షలు అందించిన డైరెక్టర్ వెంకీ అట్లూరి



సాక్షి, హైదరాబాద్: తమిళనటుడు ధనుష్, సంయుక్తా మీనన్ జంటగా వెంకీ అట్లూరి దర్శకత్వంలో రూపొందిన ద్విభాషా (తెలుగు, తమిళం) చిత్రం 'సార్' (తమిళంలో 'వాత్తి'). గత నెల ఫిబ్రవరి 17న విడుదలైన 'సార్' చిత్రంలో కథరీత్యా సిరిపురం అనే ఊరిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు జూనియర్ లెక్చరర్‌గా వెళతాడు బాలగంగాధర తిలక్ (సినిమాలో ధనుష్ పాత్ర..) కానీ అక్కడి విద్యార్థులెవరూ కళాశాలకు రాకపోవడంతో వారిని తిరిగి కళాశాలకు వచ్చేలా చేస్తాడు. విద్య గొప్పతనాన్ని తెలియజేస్తూ, కుల వ్యవస్థపై వారిని చైతన్యవంతులను చేసేందుకు కృషి చేస్తాడు తిలక్. ఇదంతా రీల్‌లో.. కానీ రియల్‌గానూ బాలగంగాధర తిలక్ పాత్రను పోలిన వ్యక్తి ఉన్నారు. ఆయనే కేడర్ల రంగయ్య.

అచ్చు సినిమాలో మాదిరిగానే..

కొమురం భీం జిల్లా కెరమెరి మండలం సావర్‌ఖేడలోని ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తున్నారు కేడర్ల రంగయ్య. ఆయన ప్రధానోపాధ్యాయుడిగా ఉన్నప్పుడు ఆ పాఠశాలలో ఉన్న విద్యార్థుల సంఖ్య 60. కానీ కృషి చేసి విద్యార్థుల సంఖ్యను ఆయన 260కి పెంచారు. తన కుమార్తెను అదే ప్రభుత్వ పాఠశాలలో చేర్పించడమే కాకుండా, సొంత డబ్బుతో పాఠశాలకు మరమ్మత్తులు చేపట్టి ఆ గ్రామస్తుల్లో స్ఫూర్తి నింపారు. ఆయనకు ఉత్తమ ఉపాధ్యాయుడిగా జాతీయ అవార్డు కూడా వచ్చింది. కాగా 'సార్' చిత్రానికి కేడర్ల రంగయ్య జీవితం స్ఫూర్తి కాకపోయినప్పటికీ, ఆయన జీవితం 'సార్'లోని ధనుష్ పాత్ర తిలక్‌కు దగ్గరగా ఉండటంతో ఆయన్ను కలిశారు చిత్రదర్శకుడు వెంకీ అట్లూరి. ''సార్ సినిమా చూస్తున్నప్పుడు కొన్ని సన్నివేశాల్లో నన్నే నేను చూసుకున్నట్లు ఉంది'' అని కేడర్ల రంగయ్య చెప్పడంతో వెంకీ ఎంతో సంతోషించారు. కాగా రంగయ్య చేస్తున్న మంచి పనుల్లో భాగస్వామ్యం కావాలని 'సార్' చిత్రం యూనిట్ రూ.మూడు లక్షలను ఆయనకు ఆర్థిక తోడ్పాటుగా అందించారు. విద్యార్థులు, పాఠశాలల్లోని మెరుగైన సదుపాయాలు, లైబ్రరీ నిర్మాణం వంటి వాటికి ఈ నగదును వినియోగించనున్నారు.

వేసవిలో నీటి కటకట రావొద్దు

మంత్రి ఎర్రబెల్లి ఆదేశాలు

సాక్షి, హైదరాబాద్: వేసవిలో తాగునీటి సరఫరాలో ఎక్కడా ఇబ్బంది లేకుండా చూడాలని, రిజర్వాయర్లలో నీటి నిల్వలు తగ్గకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశించారు. కరెంటు సమస్యలు వచ్చినా నీటి సరఫరా ఆగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. పంపుల నిర్వహణ సరిగా నిర్వహించి పైప్ లైన్ లీకేజీలు లేకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. ఈ సారి ఎండలు ఎక్కువగా ఉండే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో, నీటి సరఫరాకు ఆటంకాలు లేకుండా, అన్ని ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. గురువారం ఎండా కాలం సన్నద్ధత పై మిషన్ భగీరథ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షలో... వేసవిలో నిరాటంకంగా నిర్వర్తించాల్సిన మంచినీటి సరఫరాపై మంత్రి సూచనలు చేశారు. అధికారులు సర్వసన్నద్ధంగా ఉండి, సమన్వయంతో పని చేయాలన్నారు. ఈఎన్‌సీ కృపాకర్‌రెడ్డి, సీఈ, ఈఈలు, అన్ని జిల్లాల ఎస్ఈలు, ఇతర ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

అయ్యో.. వినయ్ సాయం చేసే వారే లేరా?

- సైన్స్‌ఫేర్‌లో కెమికల్ బాటిల్ తీసుకెళ్తూ గాయపడిన విద్యార్థి
- 25 శాతం కాలిన పొట్ట భాగం.. అనేక చోట్ల గాజుముక్కలు



హైదరాబాద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వినయ్

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: సైన్స్‌ఫేర్‌లో చోటు చేసుకున్న అపశృతితో ఓ పేద విద్యార్థి తీవ్రంగా గాయపడగా.. సాయం కోసం దాతల చేయూతతో పాటు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. గత నెల 28న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మండలపల్లిలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో నిర్వహించిన సైన్స్ ఫేర్‌లో అమ్మోనియం రసాయనం బాటిల్‌ను తీసుకెళ్తూ ఆరో తరగతి విద్యార్థి వినయ్‌కుమార్ అదుపుతప్పి కింద పడ్డాడు. దీంతో బాటిల్ పగిలిపోయి అందులోని రసాయనం వినయ్ శరీరంపై పడింది. ప్రాథమిక చికిత్స తర్వాత మెరుగైన వైద్యం కోసం విద్యార్థి తల్లిదండ్రులు హైదరాబాద్‌లోని కార్పొరేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. రసాయనం శరీరంపై పడడంతో పొట్ట భాగం 25 శాతం మేర కాలిపోగా, గాజు ముక్కలు శరీరంలోని అనేక భాగాలు కుచ్చుకున్నాయని నిర్ధారించారు. చర్మం కాలిన చోట ప్లాస్టిక్ సర్జరీలు చేయాల్సి ఉంటుందని, ఇందుకు రూ.10 లక్షలు ఖర్చు కావొచ్చని వైద్యులు చెబుతున్నారు. కానీ వ్యవసాయకూలీలైన వినయ్ తల్లిదండ్రులు ఆ ఖర్చును భరించే స్థితిలో లేకపోవడంతో దాతలతో పాటు సర్కారు సాయం కోరుతున్నారు.

క్లుప్తంగా...

నేటి నుంచి తిరుమలలో తెప్పోత్సవాలు

5 రోజుల పాటు పలు ఆర్జిత సేవల రద్దు

తిరుమల: తిరుమలలోని శ్రీవారి పుష్కరిణిలో శుక్రవారం నుంచి 5 రోజులు పాటు తెప్పోత్సవాలు జరగనున్నాయి. ఈ సందర్భంగా విద్యుద్దీపాలతో తిరుమల ఆలయం, పరిసరాలను శోభాయమానంగా అలంకరించారు. శ్రీవారి తెప్పోత్సవాల్లో పాల్గొనాలనుకునే భక్తుల కోసం టీటీడీ కరెంట్ బుకింగ్ ద్వారా ప్రతిరోజు 200 టికెట్లను జారీ చేయనుంది. ఈ టికెట్లు ఉన్న భక్తులను టీటీడీ పుష్కరిణిలోకి ప్రత్యేకంగా అనుమతించనుంది. తెప్పోత్సవాల నేపథ్యంలో 5 రోజుల పాటు పలు ఆర్జిత సేవలను టీటీడీ రద్దు చేసింది. కాగా, తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. టైం స్లాట్ దర్శన టికెట్లు కలిగిన వారికి సకాలంలో, దర్శన టికెట్లు లేని వారికి 16 గంటల్లో, ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు ఉన్నవారికి 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

హ్యాండ్లూమ్ ఎక్స్‌పో 11 నుంచి

సాక్షి, హైదరాబాద్: నెక్లెస్ రోడ్డులోని పీపుల్స్ ప్లాజాలో ఈనెల 11వ తేదీ నుంచి 24వ తేదీ వరకు నేషనల్ హ్యాండ్లూమ్ ఎక్స్‌పో–2023ని నిర్వహించనున్నారు. రాష్ట్ర చేనేత ఉత్పత్తుల సంస్థ, జాతీయ హ్యాండ్లూమ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో సంయుక్తంగా ఈ ఎక్స్‌పో నిర్వహిస్తున్నారు. భారతదేశం నలుమూలల నుంచి చేనేత ఏజెన్సీల భాగస్వామ్యం ఉంటుందని పేర్కొన్నారు. ఎక్స్‌పోలో 20 నుంచి 30 శాతం తగ్గింపు ధరలకు ఉత్పత్తులను విక్రయిస్తారని నిర్వాహకులు తెలిపారు.

విద్యుత్ పీఆర్సీపై 6న చర్చలు

జేఏసీల నేతలను ఆహ్వానించిన యాజమాన్యాలు

సాక్షి, హైదరాబాద్: విద్యుత్ ఉద్యోగుల వేతన సవరణపై సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు విద్యుత్ సౌధలో చర్చలకు రావాలని విద్యుత్ ఉద్యోగ సంఘాల జేఏసీలను విద్యుత్ సంస్థల యాజమాన్యాలు ఆహ్వానించాయి. సమావేశంలో తెలంగాణ ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ డి.ప్రభాకర్‌రావు, ఉత్తర, దక్షిణ డిస్కంల సీఎండీలు రఘుమారెడ్డి, గోపాల్‌రావు ఉద్యోగ నేతలతో చర్చించనున్నారు. అనంతరం పీఆర్సీ ఫిట్‌మెంట్ శాతాన్ని సిఫారసు చేస్తూ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు యాజమాన్యాలు నివేదిక అందజేయనున్నాయి. త్వరలో సీఎం కేసీఆర్ పీఆర్సీపై ప్రకటన చేసే అవకాశం ఉంది.

జిల్లా వార్తలు


షంషేర్.. ఇక్కడే ఉండిపోవాలంటే!?

- రెండేళ్లుగా అతిథిలా వచ్చివెళ్తున్న బెంగాల్ టైగర్
- స్థిర నివాసం ఏర్పాటుకు పులుల వెనుకంజ
- 2015 తర్వాత జిల్లాలో కనుమరుగైన పులుల జాడ
- అభయారణ్యంలో అడవి దున్నలు, చుక్కల దుప్పులు మాత్రమే

నేడు వన్యప్రాణుల సంరక్షణ దినోత్సవం



కిన్నెరసాని డీర్‌పార్కులోని చుక్కల దుప్పులు



పులి

పాల్వంచరూరల్: అటవీ ప్రాంతం క్రమక్రమంగా అంతరించిపోవడంతో అభయారణ్యాల్లో జంతువుల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోంది. జంతువులు నీళ్ల కోసం వేసవిలో స్థావరాలను వదిలి నివాస ప్రాంతాలకు తరలివస్తున్నాయి. మరికొన్ని ఇతర ప్రాంతాలకు వలస వెళ్తున్నాయి. దీంతో జిల్లాలోని అరుదైన జంతువులు కనుమరుగుమవుతున్నాయి. 2015 తర్వాత పులుల జాడ కానరాకపోగా, మధ్యలో ఒకటి, రెండు సార్లు వచ్చివెళ్తుండడమే తప్ప స్థిర నివాసం ఏర్పాటుచేసుకోవడం లేదని అధికారిక వర్గాల ద్వారా తెలుస్తోంది. దీనికి అభయారణ్యాల్లోని అధ్వాన పరిస్థితులు, వేటగాళ్ల బెడద కారణంగా చెబుతున్నారు. ఈక్రమంలో నేడు (శుక్రవారం) వన్యప్రాణుల సంరక్షణ దినోత్సవం సందర్భంగా కథనం.

జాడలేని పులులు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అటవీ శాఖకు సంబంధించి ఆరు డివిజన్లు, 24 రేంజ్‌లు ఉన్నాయి. జిల్లా అటవీ విస్తీర్ణం 4.33 లక్షల హెక్టార్లుగా ఉంది. ఇందులో కిన్నెరసాని అభయారణ్యం 634.4 చదరపు కిలోమీటర్లలో విస్తరించింది. ఇంత భారీ స్థాయిలో అడవి విస్తరించి ఉన్నా ఇక్కడ పెద్ద పులులు నివాసం ఏర్పాటు చేసుకోవడం లేదు. కిన్నెరసాని అభయారణ్యంలోని పడిగాపురం బీట్‌లో 2015లో పులి సంచారాన్ని గుర్తించారు. ఆ తర్వాత జాతీయ పులుల గణన–2018, ఎన్‌జీఓ బృందం వన్యప్రాణుల ఆక్యుపెన్సీ పేరుతో చేపట్టిన మరో సర్వేలోనూ పులుల జాడ కనిపించలేదు. కానీ 2020, 2021ల్లో వరుసగా రెండేళ్లు పెద్దపులి అడుగు జాడలు జిల్లాలో కన్పించాయి. అదేవిధంగా చిరుతల సంచారాన్ని గుర్తించారు.

నివాసయోగ్యంగా లేవు..

గడిచిన రెండేళ్లుగా అడపాదడపా పెద్దపులులు జిల్లా అడవుల్లో సంచరించడం మినహా ఇక్కడే స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్న ఆనవాళ్లు లేవు. పులులు నివసించేందుకు అనువైన పరిస్థితులు జిల్లాలో కరువవడమే ఇందుకు కారణమని తెలుస్తోంది. కిన్నెరసాని అభయారణ్యంలోనే 20వేల హెక్టార్లకు పైగా అటవీ ప్రాంతం అక్రమణకు గురైందంటే ఇక సాధారణ అడవుల్లో పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ఫలితంగా జాతీయ జంతువు జిల్లాకు అతిథిలా వచ్చిపోతుందే తప్పితే స్థిర నివాసం ఏర్పాటు చేసుకోవడం లేదు. చిరుతల విషయంలోనూ పరిస్థితి ఇదే విధంగా ఉంది. ఇదే సమయంలో జిల్లాలో నివసిస్తున్న ఎలుగుబంట్లు సంఖ్య 412గా నమోదైంది.

ఇంకా మెరుగుపడితేనే...

పులులు, చిరుతల వంటి జంతువుల జాడ పెద్దగా లేకపోయినా అడవిగేదెలు, దున్నలు, ఎలుగుబంట్లు, చుక్కల దుప్పులు, కణుజులు జిల్లాలో అధికంగా సంచరిస్తున్నట్లు గుర్తించారు. ఐదేళ్ల కిందటి అధికారిక లెక్కల ప్రకారం జిల్లాలో చుక్కల దుప్పులు 4,278, కొండగొర్రెలు ఉన్నాయి. ఇవే కాకుండా కిన్నెరసాని రిజర్వాయర్‌లో వేల సంఖ్యలో మోరే జాతి మొసళ్లు, నెమళ్లు, కుందేళ్లు, కొండముచ్చులు ఉన్నాయి. అయితే పులులు ఇక్కడే స్థిర నివాసం ఏర్పాటు చేసుకోవాలంటే వాటికి ఆహారంగా ఉపయోగపడే జింకలు, అడవి దున్నల సంఖ్య మరింతగా పెరగాల్సిన అవసరం ఉంది.

వేటగాళ్లు జర మారండి

జంతువుల సంరక్షణకు ఎన్ని చట్టాలు ఉన్నా వన్యప్రాణుల వేట ఆగడం లేదు. చాటుమాటుగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని అటవీ ప్రాంతాల్లో జంతువులను వధిస్తున్నారు. మరికొన్ని సందర్భాల్లో పొలాలకు ఏర్పాటు చేసిన కరెంటు వైర్లు తగిలి కూడా అటవీ జంతువులు ప్రాణాలు కోల్పోతున్నాయి. గతేడాది నుంచి ఇప్పటి వరకు జిల్లాలో ఇప్పటివరకు జంతువులను వధించిన, వేటాడిన సంఘటనలతో 31 మందిపై కేసులు నమోదు చేశారు. గతేడాది వైల్డ్‌లైఫ్ పరిధిలోని రేగళ్ల అటవీ ప్రాంతంలో మూడు చుక్కల దుప్పులను చంపిన కేసు జిల్లా వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. జిల్లాలోని అడవులు వన్యప్రాణులతో కళకళలాడాలంటే వేటగాళ్లు తమ పని మాని ఇతర వృత్తులోకి వెళ్లాలి. అందుకు తగ్గట్టుగా అటవీ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలి.

వన్యప్రాణుల సంరక్షణపై ప్రత్యేక దృష్టి



జిల్లాలో అటవీ జంతువుల సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాం. బీట్ల వారీగా రాత్రి పగలు నిఘా కోసం 30 బేస్‌క్యాంప్‌లు ఏర్పాటుచేసి 150 మంది సిబ్బంది నియమించాం. వీరికి వాకీటాకీల కావాలని ప్రతిపాదించాం. వన్యప్రాణుల సంరక్షణను ప్రజలు కూడా బాధ్యతగా గుర్తించాలి.
–లక్ష్మణ్ రంజిత్ నాయక్, డీఎఫ్ఓ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

పులులు వచ్చి వెళ్తున్నాయి...



పులులు గత రెండేళ్లుగా వచ్చివెళ్తున్నాయి. చిరుతపులుల సంచారం కూడా ఉంది. వన్యప్రాణుల కోసం వేసవిలో సోలార్ పంపుసెట్ల ద్వారా తాగునీటి సౌకర్యం కల్పిస్తున్నాం. అలాగే, వన్యప్రాణుల సంరక్షణపై ఏజెన్సీ గ్రామాల ప్రజలకు అవగాహన కల్పించి జాగృతం చేస్తున్నాం.
– కె.దామోదర్‌రెడ్డి, వైల్డ్‌లైఫ్ ఎఫ్‌డీఓ, పాల్వంచ

సరస్వతి శిశుమందిర్‌కు హైకోర్టు జడ్జి విరాళం



హెచ్‌ఎంకు నగదు అందచేస్తున్న న్యాయమూర్తి స్నేహితులు

భద్రాచలం: భద్రాచలంలో సరస్వతి శిశుమందిర్ నిర్వహణకు భద్రాచలం వాస్తవ్యులు, హైకోర్టు న్యాయమూర్తి భీమపాక నగేష్ రూ.50వేల విరాళం ప్రకటించారు. పాఠశాలలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయన తరఫున స్నేహితులు నగదును ప్రధానోపాధ్యాయురాలికి అందచేశారు. ఇటీవల కన్నుమూసిన తన తండ్రి, పాలేరు మాజీ ఎమ్మెల్యే భీమపాక భూపతిరావు జ్ఞాపకార్థం న్యాయమూర్తి ఈ విరాళం అందచేశారని వారు తెలిపారు.

ఇనుగుర్తిని విద్యాకేంద్రంగా తీర్చిదిద్దాలి



మాట్లాడుతున్న డీఈఓ రామారావు

కేసముద్రం: కొత్తగా ఏర్పడిన ఇనుగుర్తి మండలాన్ని విద్యా కేంద్రంగా తీర్చిదిద్దడానికి ప్రతీ ఒక్కరు కృషి చేయాలని డీఈఓ రామారావు సూచించారు. ఇనుగుర్తి జెడ్పీఎస్ఎస్‌లో గురువారం ఏర్పాటుచేసిన ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంల సమావేశంలో ఆయన మాట్లాడారు. పదో తరగతి విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ ఉత్తమ ఫలితాలు వచ్చేలా కృషి చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల కల్పనకు ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ముందుకొచ్చినందున అవసరమైన వివరాలు అందించాలని సూచించారు. అనంతరం వద్దిరాజు దేవేందర్‌ను డీఈఓ సత్కరించారు. ఎంఈఓ శ్రీదేవి అధ్యక్షతన జరిగిన ఈసమావేశంలో జిల్లా సెక్టోరల్ అధికారి మాంకాళి బుచ్చయ్య, సర్పంచ్ దార్ల రామ్మూర్తితో పాటు కొత్త జగన్‌మోహన్‌రెడ్డి, బత్తిని రాజేందర్, పింగిళి శ్రీనివాస్, ఖాదర్, సుధాకర్, ఉదయ్, సరిత, నాగవాణి, కవిత తదితరులు పాల్గొన్నారు.

గిరిజన రైతులకు 'సమగ్ర వ్యవసాయం'పై శిక్షణ



రైతులకు పరికరాలు అందజేస్తున్న డీన్ అహ్మద్ హుస్సేన్

అశ్వారావుపేటరూరల్: సమగ్ర వ్యవసాయ వ్యవస్థలపై అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల ఆధ్వర్యాన గిరిజన రైతులకు శిక్షణ ఏర్పాటుచేశారు. ఐసీఏఆర్ గిరిజన ఉప ప్రణాళికలో భాగంగా మండలంలోని మల్లాయిగూడెంలో ఈ శిక్షణ ఏర్పాటుచేయగా పంటల్లో యాజమాన్య పద్ధతులు, వ్యవసాయ అనుబంధంగా పాడి పశువులు, పెరటి కోళ్ల పెంపకంతో లాభాలపై కళాశాల సేద్య విభాగం శాస్త్రవేత్త డాక్టర్ నాగాంజలి అవగాహన కల్పించారు. అలాగే, పలు అంశాలపై శాస్త్రవేత్తలు డాక్టర్ రాంప్రసాద్, డాక్టర్ టి.పావని, డాక్టర్ ఐ.వీ.శ్రీనివాసరెడ్డి, డాక్టర్ రెడ్డి ప్రియ, డాక్టర్ సిద్ధప్ప మాట్లాడారు. ఆతర్వాత రైతులకు స్ప్రేయర్లు, వ్యవసాయ దిక్సూచి పుస్తకాలు, జీవన ఎరువుల ప్యాకెట్లను వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ సయ్యద్ అహ్మద్ హుస్సేన్ అందజేశారు. గ్రామ సర్పంచ్ నారం రాజశేఖర్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో పశు సంవర్ధక వైద్యురాలు స్వప్న, కళాశాల ప్రొఫెసర్లు డాక్టర్ కె.గోపాలకృష్ణమూర్తి, డాక్టర్ వి.వెంకన్న, డాక్టర్ శిరీష, డాక్టర్ సిద్ధప్ప, ఏఈఓ షాకీరాబానుతో పాటు బుచ్చయ్య, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక విద్యను పటిష్టపరచడమే లక్ష్యం

జూలూరుపాడు: రాష్ట్రవ్యాప్తంగా ప్రాథమిక విద్యను పటిష్టపరచడమే ప్రభుత్వ లక్ష్యమని విద్యాశాఖ ఎఫ్ఎల్ఎన్ ఉమ్మడి జిల్లా కన్వీనర్ వెంకటరెడ్డి తెలిపారు. జూలూరుపాడు మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఫౌండేషన్ లిట్రసీ అండ్ న్యూమరాలిటీ (ఎఫ్ఎల్ఎన్) కార్యక్రమ తీరుతెన్నులు, విద్యార్థుల ప్రగతిపై రాష్ట్ర, జిల్లా విద్యాశాఖ అధికారులు గురువారం పరిశీలించారు. మండలంలోని పలుప్రాథమిక, ఉన్నత పాఠశాలలతో పాటు జూలూరుపాడు కేజీబీవీలో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించాక ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా కన్వీనర్ వెంకటరెడ్డి మాట్లాడుతూ కరోనా కారణంగా విద్యార్థులు చదువులో వెనకబడడంతో ఎఫ్ఎల్ఎన్ ప్రోగ్రాం చేపడుతున్నట్లు తెలిపారు. ఈమేరకు విద్యార్థులకు ప్రాథమిక స్థాయిలోనే కనీస పరిజ్ఞానం పెంపొందించడంతో పాటు పదో తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షల్లో మంచి మార్కులు సాధించేలా తీర్చిదాద్దాలని సూచించారు. ఖమ్మం డైట్ కాలేజ్ లెక్చరర్ బాలమురళీకృష్ణ, ఎఫ్ఎల్ఎన్ జిల్లా రిసోర్స్‌పర్సన్ వెంకటేశ్వర్లు, ఎంఈఓ గుగులోత్ వెంకట్‌తో పాటు బి.బాలాజీ, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రేపు 'విజయ'లో మెగా జాబ్‌మేళా

కొణిజర్ల: కొణిజర్ల మండలం తనికెళ్ల సమీపాన ఉన్న విజయ ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 4వ తేదీన మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల వైస్ చైర్మన్ పారుపల్లి విజయలక్ష్మి తెలిపారు. కళాశాలలో గురువారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె వివరాలు వెల్లడించారు. హైదరాబాద్‌కు చెందిన నలభైకి పైగా కంపెనీల ఆధ్వర్యాన జాబ్‌మేళా నిర్వహిస్తుండగా, 2020 నుంచి 2023 వరకు డిగ్రీ పాసైన వారితో పాటు బీటెక్, ఎంటెక్, ఎంబీఏ, బీ ఫార్మసీ, ఎం ఫార్మసీ, నర్సింగ్ అర్హత కలిగిన యువతీ యువకులు పాల్గొనవచ్చని తెలిపారు. జాబ్‌మేళాను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎంపీలు నామా నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని నిరుద్యోగ అభ్యర్థులు వివరాల కోసం 90325 86124, 90591 86124 నంబర్లను సంప్రదించాలని ఆమె సూచించారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి



మాట్లాడుతున్న సైకాలజిస్ట్ పూర్ణచందర్

నెల్లికుదురు: ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించేలా అధ్యాపకులు దృష్టి సారించాలని డీఐఈఓ సమ్మెట సత్యనారాయణ అన్నారు. నెల్లికుదురు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పొక్కుల సదానందం అధ్యక్షతన గురువారం తొర్రూరు, మరిపెడ, నెల్లికుదురు ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, మోడల్ జూనియర్ కళాశాలల విద్యార్థులకు ఆదర్శ పాఠశాలలో అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా డీఐఈఓ మాట్లాడాక, ప్రముఖ సైకాలజిస్ట్ గుడిబోయిన పూర్ణచందర్ పరీక్షలకు సిద్ధం కావాల్సిన తీరుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపాళ్లు డాక్టర్ కె.శ్రీనివాస్, వీరేందర్, శ్రీనివాసరావు, రమేష్, రిసోర్స్ పర్సన్ శ్రీనివాస్, అధ్యాపకులు పాల్గొన్నారు.